క్లుప్తంగా

చోరీ కేసులో ఇద్దరి అరెస్టు

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని న్యాయస్థాన సముదాయంలో చోరీకి పాల్పడ్డ సురేష్ (31), లెలిన్ కుమార్ (22)ను పోలీసులు గురువారం అరెస్టు చేశారు. సీఐ మహేశ్వర్ కథనం .. చిత్తూరు కోర్టు సముదాయంలో బాత్రూములు, ఇతర ప్రాంతాల్లో కొన్ని వస్తువులు చోరీకి గురవుతున్నట్లు అక్కడి అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పరిశీలించిన పోలీసులు గంగాధర్ నెల్లూరు మండలం బాలగంగానపల్లె చెందిన సురేష్, చిత్తూరు మండలం పచ్చనపల్లెకు చెందిన లెలిన్ కుమార్ ఈ చోరీలు చేస్తున్నట్టు తేలింది. వారిని అరెస్టు చేసి న్యాయమూర్తి పరచారు. ఆయన రిమాండ్‌కు ఆదేశించంతో నిందితులను చిత్తూరు జిల్లా జైలుకు తరలించారు.

పంచాయతీల్లో పారిశుధ్య పనులు


నింద్రలో జేసీబీతో చేస్తున్న పనులు

నింద్ర: స్థానిక పంచాయతీలో తాగునీరు లీకేజీలు ఉన్నచోట గురువారం మరమ్మతులు చేశారు. అలాగే పారిశుధ్యం మెరుగు పరచారు. అధికారుల ఆదేశాలతో సర్పంచులు ఈ పనులకు పూనుకున్నారు. నింద్ర పంచాయతీలో రోడ్డు ఇరువైపులా ఉన్న పిచ్చిమొక్కలు తొలగించారు.

కాలువ ఆక్రమణపై ఆందోళన

పాలసముద్రం: మండలంలోని రామక్రిష్టాపురం రెవెన్యూలో సర్వే నంబర్ 32లో ఉన్న కాలువను అక్రమంగా జేసీబీతో చదును చేసి ఆక్రమిస్తున్నారని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. సర్వే నంబర్ 32లో 3.64 సెంట్లు కాలువ పొరంబోకు స్థలంగా రెవెన్యూ రికార్డుల్లో ఉంది. అయితే గ్రామానికి చెందిన ఓ రైతు కాలువ పొరంబోకు స్థలంలోని 1.80 సెంట్ల స్థలాన్ని చెరువు మట్టితో కాలువను పూడ్చి చదును చేసి కొబ్బరి, మామిడి చెట్లు నాటారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్‌కు గ్రామస్తులు సోమవారం ఫిర్యాదు చేశారు. అయితే రెవెన్యూ అధికారులు పొలం వద్దకు వచ్చి ఎలాంటి పరిష్కారం చూపకుండా వెళ్లడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం వద్దు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

వడమాలపేట (విజయపురం): ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించరాదని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ అన్నారు. గురువారం వడమాలపేట మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రాజలక్ష్మి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే మాట్లాడారు. మండలంలో నెలకొన్న సమస్యలపై అధికారులు దృష్టి పెట్టాలని, రెవెన్యూ సమస్యలపై వెంటనే స్పందించి, ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శేషగిరిరావు, మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


శాస్త్రోక్తంగా ధ్వజారోహణం


పూజలు చేస్తున్న భక్తులు

వెదురుకుప్పం: మండలంలోని చవటగుంట ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో జరగనున్న మహా భారత ఉత్సవాలను పురస్కరించుకుని గురువారం ఆలయంలో ధ్వజారోహణ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అంతకు ముందు ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం సకల దేవతలకు ఆహ్వానం పలుకుతూ ధ్వజారోహణం చేశారు. బుధవారం నుంచే ఆలయంలో ఉత్సవాలు జరుగుతున్నాయని ఆలయ ధర్మకర్త తెలిపారు.

టీడీపీ నేత అక్రమ నిర్మాణం

- సుందరయ్యనగర్‌లో కబ్జా పర్వం
- స్టేటస్‌కో ఉన్నప్పటికీ ఇంటి నిర్మాణ పనులు
- కబ్జాదారుడిపై చర్యలు తీసుకోవాలని లబ్ధిదారుల డిమాండ్


సుందరయ్యనగర్‌లో స్థల కబ్జా చేసి టీడీపీ నేత చేస్తున్న ఇంటి నిర్మాణ పనులు

పుత్తూరు: మున్సిపాలిటీ 5వ వార్డుకు చెందిన సుందరయ్యనగర్‌లో అక్రమ నిర్మాణాలు జరుగుతుండడంతో లబ్ధిదారులు ఆందోళనకు సన్నద్ధమవుతున్నారు. వివరాలు.. 2009లో అప్పటి సీపీఎం నాయకులు కె.మురగారెడ్డి నేతృత్వంలో చేసిన పోరాటం ఫలితంగా నాటి వైఎస్సార్ ప్రభుత్వం నేసనూరు రెవెన్యూ లెక్క దాఖలా 186/8,9 లోని 2.65 ఎకరాల విస్తీర్ణంలో 172 మంది నిరుపేదలకు ఇంటి పట్టాలు పంపిణీ చేసింది. పట్టాలు పొందిన లబ్ధిదారుల్లో 70 మంది అప్పట్లో పునాదులు తీసి ఇళ్ల నిర్మాణాలకు పూనుకున్నారు. ముఖ్యఅతిథులుగా హాజరైన ప్రముఖ సినీనటుడు మాదాల రంగారావు, సీపీఎం జిల్లా కార్యదర్శి కె.కుమార్‌రెడ్డి చేతుల మీదుగా ఆ స్థలానికి సుందరయ్యనగర్ అని నామకరణం చేశారు. పనులు ప్రారంభించిన లబ్ధిదారులు ఆ తర్వాత ఆర్థిక ఇబ్బందులతో ఇళ్ల నిర్మాణాలను పునాదుల దశలోనే ఆపేశారు. ప్రభుత్వమే ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇస్తుందని వేచిచూస్తూ వచ్చారు. ఈ నేపథ్యంలో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి రావడంతో 2017లో సుందరయ్యనగర్‌లోనే టిడ్కో ఇళ్ల నిర్మాణానికి అప్పటి ఎమ్మెల్యే గాలి ముద్దుకృష్ణమనాయుడు రెవెన్యూ అధికారులతో సర్వే చేయించారు. దీంతో అప్పటికే ఇంటి పట్టాలు పొందిన లబ్ధిదారులు కోర్టును ఆశ్రయించి స్టేటస్‌కో తీసుకొచ్చారు. అప్పటి నుంచి ఇది కొనసాగుతూనే ఉంది. ఈ నేపథ్యంలో రెండు రోజుల క్రితం టీడీపీకి చెందిన ఓ చోటా నాయకుడు తన సమీప బంధువు ద్వారా సర్వే నంబర్ 186/8లో అక్రమంగా ఇంటి నిర్మాణానికి ఉపక్రమించాడు. దీంతో లబ్ధిదారులు.. కోర్టులో వ్యవహారం నడుస్తున్న సమయంలో అక్రమ నిర్మాణానికి చేపట్టడం పూర్తిగా చట్ట విరుద్ధమని, అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని మండిపడుతున్నారు.

పోలీసు కేసు నమోదు చేయాలి



స్టేటస్‌కో ఉన్న స్థలంలో అక్రమంగా ఇంటి నిర్మాణం చేస్తున్న వ్యక్తిపై తహసీల్దార్ పోలీసు కేసు నమోదు చేయించాలి. రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో కబ్జాదారులు అక్రమ నిర్మాణాలకు పాల్పడుతున్నారు.
–కె.హేమలత, లబ్ధిదారురాలు, సుందరయ్యనగర్, పుత్తూరు

ఆందోళన తప్పదు



మేము పోరాడి సాధించుకున్న ఇళ్ల స్థలాల్లో రాజకీయ అండదండలతో అక్రమ నిర్మాణాలకు పాల్పడితే ఆందోళన తప్పదు. ఇదివరకే ఇక్కడ జరుగుతున్న ఆక్రమణలపై రెవెన్యూ అధికారులకు సమాచారమిచ్చినా పట్టించుకోకపోవడం సిగ్గుచేటు. దీనికి పూర్తి బాధ్యత రెవెన్యూ అధికారులదే.
–పి.జ్యోతి, లబ్ధిదారురాలు, సుందరయ్యనగర్, పుత్తూరు

కోర్టు ధిక్కారణ కేసులు తప్పవు



సుందరయ్యనగర్ స్థలంలో స్టేటస్‌కో ఉన్న నేపథ్యంలో ఎవరైనా ఎలాంటి నిర్మాణాలకు పూనుకున్నా శిక్షార్హులే. అక్కడ జరుగుతున్న అక్రమ నిర్మాణాల గురించి సమాచారం అందింది. తక్షణం నిర్మాణాలను ఆపించి తగిన చర్యలు తీసుకుంటాం. –జీసీ. వెంకటేశ్వర్లు, తహసీల్దార్, పుత్తూరు

నోటీస్ బోర్డు

డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

తవణంపల్లె: డీఎస్సీ రాసే అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు రీడ్స్ సంస్థ డైరెక్టర్ థియో స్టీఫెన్, కో-ఆర్డినేటర్ కోదండపాణి తెలిపారు. ప్రత్యేక శిక్షణ పొందిన ఉపాధ్యాయులతో ఐరాల మండలంలోని సెయింట్ స్టీఫెన్ పబ్లిక్ స్కూల్ క్యాంపస్‌లో ఈ నెల 28, 29 తేదీల్లో డీఎస్సీ అభ్యర్థులకు శిక్షణ ఇస్తామని, అలాగే అభ్యర్థులకు ఉచిత భోజన వసతి కూడా కల్పించనున్నట్టు చెప్పారు. దీనిని జిల్లాలోని డీఎస్సీ పేద అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు సంప్రదించాల్సిన సెల్: 9908260007

నేడు బీఎస్ఎన్ఎల్ కస్టమర్ సేవా శిబిరం

పుత్తూరు: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద శుక్రవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు బీఎస్ఎన్ఎల్ కస్టమర్ సేవా శిబిరం నిర్వహిస్తున్నట్లు డీఈ చంద్రశేఖర్ గురువారం తెలిపారు. వినియోగదారులు ఫిర్యాదులను, సర్వీస్ సంబంధిత సమస్యలను తెలియజేయవచ్చన్నారు. ఇంటర్నెట్ కనెక్షన్లు, సిమ్ కార్డుల తక్షణ బుకింగ్, యాక్టివేషన్ ఇత్యాది వాటిని అధికారులు సులభతరం చేస్తారని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

నగరి: మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు చైర్మన్ పీజీ నీలమేఘం అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహిస్తామని కమిషనర్ కృష్ణారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

పార్టీ అభివృద్ధికి కలిసి పనిచేయండి


వైఎస్సార్‌సీపీ కార్యవర్గ సభ్యులను సన్మానిస్తున్న మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి


నరసింహారెడ్డి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

కార్వేటినగరం: వైఎస్సార్‌సీపీ అభివృద్ధి కోసం కార్యకర్తలు, నాయకులు కలిసి పనిచేయాలని రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణ స్వామి పిలుపునిచ్చారు. గురువారం వైఎస్సార్‌సీపీ మండల కార్యవర్గ సభ్యులుగా నియమితులైన వారిని ఆయన సత్కరించారు. ఈ సందర్భంగా మాజీ ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. జగనన్న కార్యకర్తలపై పెట్టుకున్న నమ్మకాన్ని దృష్టిలో పెట్టుకుని రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీకి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు శేషాద్రి, రాజారెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు మురగయ్య, దామురెడ్డి, మాజీ సర్పంచ్ అమీద్, పాల్గొన్నారు.

నరసింహారెడ్డి మృతి పార్టీకి తీరని లోటు

పెనుమూరు(కార్వేటినగరం): మహాసముద్రం నరసింహారెడ్డి మృతి వైఎస్సార్‌సీపీకి తీరని లోటని రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. గురువారం మండల పరిధిలోని పుల్లికల్లు గ్రామంలో నిర్వహించిన మహాసముద్రం నరసింహారెడ్డి కర్మ క్రియల్లో పాల్గొని చిత్రపటానికి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ మహా సముద్రం హేమలతరెడ్డి, మండల మాజీ కన్వీనర్ సురేష్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు మోహన్, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

నిరసన ర్యాలీ


నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

వెదురుకుప్పం: కశ్మీర్‌లో పహల్గామ్ ప్రాంతంలో జరిగిన ఉగ్రవాదుల దాడికి నిరసనగా గురువారం సాయంత్రం మండలంలోని పచ్చికాపల్లంలో శ్రీ లక్ష్మీ మొబైల్స్ అండ్ ఎలక్ట్రానిక్స్ నిర్వాహకులు ప్రసాద్ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ చేశారు.

కలుషితమైన తాగునీరు!

- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



నగరి: మున్సిపల్ పరిధిలో ప్రజలకు సరఫరా చేసే నీరు వారం రోజులకు పైగా కలుషితమై రంగు మారి వస్తోంది. సత్రవాడ సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నుంచి శుద్ధీకరించి ఫిల్టర్ అయివచ్చే నీరు రంగుమారి రావడంతో ఆ నీటిని వినియోగించుకోలేకపోతున్నారు. ఇప్పటికే ఇళ్లలోని బోర్ల నుంచి వచ్చేనీరు తాగడానికి అనువుగా లేదు. దీంతో తాగడానికి, వంటలకు వాటర్ ప్లాంట్ నుంచి నీటిని తెచ్చుకుంటున్నా ఇతర వినియోగాలకు విధిలేక రంగునీటినే వాడుకుంటున్నారు. రంగు మారిన నీటిని టెస్టింగ్‌కు పంపామని నీటి సరఫరా సిబ్బంది చెప్పారు.

ఎంఎల్ఎస్ పాయింట్ తనిఖీ

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు నగరం మంగసముద్రం హౌసింగ్ కాలనీ ప్రాంతంలోని ఎంఎల్ఎస్ పాయింట్‌ను గురువారం జేసీ విద్యాధరి ఆకస్మిక తనిఖీ చేశారు. బియ్యం నిల్వలను పరిశీలించారు. అలాగే తూకం మెషిన్లు సక్రమంగా పనిచేస్తున్నాయా లేదా అడిగి తెలుసుకున్నారు. రికార్డులను చూశారు. రేషన్ షాపులకు సరుకుల సరఫరాపై ఆరా తీశారు. పారదర్శకంగా నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని, కార్డుదారులకు ఇబ్బంది లేకుండా చూడాలని జేసీ పౌర సరఫరాలశాఖ అధికారులకు ఆదేశించారు. తనిఖీలో ఆమె వెంట జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ బాలకృష్ణ, డీఎస్ఓ శంకరన్, డీటీ శ్రీనివాసులు, సిబ్బంది ఎబినైజర్ తదితరులున్నారు.

ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య


విద్యార్థులకు అడ్మిషన్లు చేయిస్తున్న అధ్యాపకులు

పాలసముద్రం: ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య సాధ్యమని పాలసముద్రం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ హేమలత తెలిపారు. గురువారం వెంగళరాజకుప్పం, పాలసముద్రం, ఆముదాల హైస్కూల్లో పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన గ్రామాలకు వెళ్లి విద్యార్థుల తల్లిదండ్రులతో అధ్యాపకులు మాట్లాడారు. ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులను చేర్పించాలని కోరారు. ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థులకు మౌలిక వసతులు, ఉచితంగా మెటీరియల్ అందిస్తామన్నారు.

రుణాలపై రైతులకు అవగాహన


నగరి: మాట్లాడుతున్న వ్యవసాయ అధికారి


పాలసముద్రం: మాట్లాడుతున్న ఏఓ

నగరి: రుణాల మంజూరు విధానంపై గురువారం ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రం పర్సన్ ఇన్‌చార్జి కేవీఆర్ కుమార్ అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. సంఘంలో రైతులు రుణాలు ఎలా పొందాలి, ఎలాంటి హామీ పత్రాలు సమర్పించాలలో సవివరంగా ఆయన తెలియజేశారు. రైతులకు ఇస్తున్న వివిధ రుణాలు, వారికి ఉపయుక్తమైన పథకాల గురించి బ్రాంచ్ సూపర్‌వైజర్ శ్రీకాంత్ తెలియజేశారు. మండల వ్యవసాయ అధికారి రాఘవేంద్ర యాదవ్ మాట్లాడుతూ, సంఘంలో తక్కువ వడ్డీలకు పంట రుణాలు ఇస్తున్నట్టు చెప్పారు. సీఈఓ తులసిపిళ్లై సంఘం నిర్వహించే పెట్రోలు బంకు, జనరిక్ మందుల షాపుల గురించి మాట్లాడారు.. 50 నుంచి 90 శాతం వరకు తగ్గింపు ధరలతో పట్టణ, గ్రామీణ ప్రజలకు జనరిక్ మందులు ఇస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు కుమార్ నాయుడు, సిబ్బంది తనికాచలం, లేపాక్షి, కార్తీక్, దుర్గాప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

రుణాలను సద్వినియోగం చేసుకోండి

పాలసముద్రం: మండలంలోని సహకార బ్యాంకులో రైతులకు ఇస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా రాణించాలని డీసీసీబీ సూపర్‌వైజర్ మాబు, మండల వ్యవసాయాధికారి డిల్లీ ప్రసాద్ తెలిపారు. గురువారం సింగిల్ విండో ఆవరణలో సీఈఓ వెంకటముని ఆధ్వర్యంలో సహకార సంఘాల రైతులకు రుణాలు, ఎరువుల వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి మాట్లాడుతూ.. మండల పరిధిలో భూములు కలిగిన ప్రతి రైతుకు, బంగారంపై సహకార సంఘం ద్వారా అన్ని రకాల రుణాలు తీసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో పీసీఏసీఎస్ సభ్యులు, రైతు సంఘం సిబ్బంది పాల్గొన్నారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

- ఇసుకాసురుల అవతారమెత్తి టీడీపీ నాయకులు
- తమిళనాడుకు తరలించి జేబులు నింపుకుంటున్న వైనం
- సామాన్యులకు ఇసుక అందక ఇక్కట్లు


కుశస్థలినదికి ఆనుకుని ఓ పొలంలో సుమారు 100 ట్రిపులకు పైగా డంపింగ్ చేసి ఉన్న ఇసుక

విజయపురం: మండల కేంద్రంతో పాటు, తమిళనాడు సరిహద్దు గ్రామాలకు పట్ట పగలే యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారు. సంబంధిత అధికారుల నిఘా, పర్యవేక్షణ కొరవడంతో ఇసుకాసురులు రెచ్చిపోతున్నారు. కొన్ని ప్రాంతాల్లో డంపింగ్ చేసి మరీ ఇసుక అక్రమ రవాణా చేస్తున్నా అధికారులు ప్రేక్షకపాత్ర వహిస్తున్నారనే విమర్శలొస్తున్నాయి. సరిహద్దు ప్రాంతమైన మహరాజపురం, శ్రీహరిపురం, మల్లారెడ్డికండ్రిగ, ఇల్లత్తూరు, కేవీశ్రీరాపురంలో ఇసుకను డంపింగ్ చేసి రేయింబవళ్లు తమిళనాడుకు తరలిస్తూ జేబులు నింపుకుంటున్నారు.

కేవీశ్రీరామపురం నాయకులు సూత్రధారులు

విజయపురం మండలంలో మొత్తం 25 పంచాయతీలు ఉన్నా కేవీశ్రీరామపురం కుశస్థలినదిలో మాత్రమే ఇసుక ఉంది. మండలంలో ఇసుక అవసరమైన వాళ్లు సొంత ట్రాక్టర్ తీసుకొచ్చి ఉచితంగా ఇసుక తీసుకువెళ్లవచ్చని అధికారులు చెబుతున్నా కేవీశ్రీరామపురానికి చెందిన కొందరు టీడీపీ నాయకులు తమ ట్రాక్టర్లు తప్పితే మిగిలిన ట్రాక్టర్లు ఇసుక తీసుకెళ్లడానికి వీలులేదని అల్టిమేటం జారీ చేశారు. దీంతో చుట్టు పక్కల ఉన్న గ్రామస్తులు ఇసుక పొందలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారం అడ్డు పెట్టుకుని టీడీపీ నాయకులు కొందరు ఇంటి పరిసర, కుశస్థలి నదిలో ఇసుకను డంపింగ్ చేసి, ట్రాక్టర్ ఇసుక రూ. 2వేల పైచిలుకు అమ్ముతున్నట్టు తెలిసింది. విధిలేక వారు డిమాండ్ చేసినంత మేరకు డబ్బు ఇచ్చి అవసరమైన వారు ఇసుకను వారి వద్ద కొంటున్నట్టు కొందరు లబ్ధిదారులు తెలిపారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు దీనిపై దృష్టి సారించి, ఇసుక అక్రమ రవాణా చెక్ పెట్టడంతోపాటు డంపింగ్ చేసిన నిల్వలను స్వాధీనం చేసుకుని అందరికీ ఇసుక అందేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

‘కూటమి’లో కుంపటి


పట్టా భూమిలో ఫెన్సింగ్ వేసిన టీడీపీ నేతలు


గొడవ పడుతున్న టీడీపీ, బీజేపీ నేతలు

- అగ్గి రాజేసిన పట్టాభూముల ఆక్రమణ
- టీడీపీ, బీజేపీ నేతల మధ్య రగడ

నగరి: నగరి మున్సిపల్ పరిధిలోని అనంతప్పనాయుడు కండ్రిగలో పట్టాభూముల విషయంలో టీడీపీ, బీజేపీ నేతల మధ్య వివాదం భగ్గుమంది. బీజేపీ నేత ఆధీనంలో ఉన్న భూముల వద్ద స్థానిక టీడీపీ నేతలు సచివాలయ సర్వేయర్లతో వచ్చి, సర్వేచేసి రాళ్లు నాటడంతో ఇది చోటుచేసుకుంది. పరస్పర వాగ్వాదాలతో ఉద్రిక్తంగా మారింది. 60 ఏళ్లకు పైగా తమపై పట్టా ఉన్న భూమిని టీడీపీ నేతలు వారికి అనుకూలంగా ఉన్న సచివాలయ సర్వేయర్లతో సర్వేచేసి ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని బీజేపీ మండల అధ్యక్షుడు హరి ఆరోపించారు. దీనిపై చర్యలు తీసుకోవాల్సిన పోలీసులు కూడా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని, పైగా టీడీపీ నేతలు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా తనపైనే కేసులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశాడు. టీడీపీ నేతల దౌర్జన్యాలకు ప్రభుత్వం అడ్డుకట్ట వేయాలన్నారు. పత్రాలు కలిగి, పట్టా ఉండి 60 ఏళ్లుగా టెంకాయ చెట్లు పెంచుతున్న భూములనే ఆక్రమించుకుంటుంటే అధికారులు అడ్డుకోకపోవడం దౌర్భాగ్యమన్నారు. రికార్డులు పరిశీలించి నిజానిజాలు తేల్చేవరకు హద్దురాళ్లు నాటరాదని తహసీల్దార్ చెప్పివెళ్లినా టీడీపీ నేతలు ఏమాత్రం లెక్కచేయకుండా, దౌర్జన్యంగా ఫెన్సింగ్ వేశారన్నారు. అధిష్టానం చర్యలు తీసుకుని కూటమిలోని పార్టీలకు న్యాయం జరిగేలా చూడాలన్నారు.

గాంధీజీ కలలు సాకారం చేయండి





సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ అనిత, గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు, వెదురుకుప్పంలో బాపూజీ, అంబేద్కర్ చిత్రపటాలకు నివాళి, పుత్తూరు: మాట్లాడుతున్న ఎంపీపీ మునివేలు

గంగాధర నెల్లూరు: జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా జీడీ నెల్లూరు ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం పంచాయతీ రాజ్ వేడుకలు మండల ఎంపీపీ అనిత ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహాత్మా గాంధీ, అంబేడ్కర్ చిత్రపటాలకు పలువురు ప్రజా ప్రతినిధులు, పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీపీ అనిత మాట్లాడుతూ.. గాంధీజీ కలలు సాకారం చేయాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ హరిబాబు , ఎంపీడీవో హరిప్రసాద్ రెడ్డి, ఏపీవో సుబ్రహ్మణ్యం, ఏపీఎం ఫరీద్ మస్తాన్, ఏపీవో శ్రీనివాసులు, వేపంజేరి సర్పంచ్ వాసుదేవ రెడ్డి, బుక్కా పట్నం సర్పంచ్ మునిరాజ రెడ్డి పాల్గొన్నారు.

గ్రామాలభివృద్ధికి కృషి

శ్రీరంగరాజపురం: గ్రామాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసికట్టుగా కృషి చేయాలని ఎంపీడీఓ మోహన్‌మురళి అన్నారు. పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలో గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. గ్రామాల అభివృద్ధికి పంచాయతీ రాజ్ వ్యవస్థ చాలా కీలకం అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సరిత, ఏపీఓ లలితకుమారి, విస్తరణాధికారి కోదండరామిరెడ్డి, ఏపీఎం రోజా, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా పంచాయతీరాజ్ దినోత్సవం

వెదురుకుప్పం: పంచాయతీరాజ్ దినోత్సవాన్ని గురువారం వెదురుకుప్పం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ పురుషోత్తం ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, జాతిపిత మహాత్మా గాంధీ చిత్ర పటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పంచాయతీ రాజ్ సేవలు, విధు లు, బాధ్యతలపై సిబ్బందికి సూచనలు ఇచ్చా రు. కార్యక్రమంలో బొమ్మయ్యపల్లె సర్పంచ్ గోవిందయ్య, ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ నాగమణి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి పంచాయతీలో అభివృద్ధి చేయండి

పుత్తూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పంచాయతీరాజ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ మునివేలు మాట్లాడుతూ, ప్రతి గ్రామ పంచాయతీలో అభివృద్ధి పనులు చేయాలని, దీనికి అనుగుణంగా అధికారులు చొరవ చూపాలని కోరారు. వేసవిలో ఎక్కడా నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రమేష్‌బాబు, సర్పంచులు, ఎంపీటీసీలు, కో-ఆప్షన్ మెంబర్లు, అధికారులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
గంగాధర నెల్లూరు : 95539 55610
నగరి : 95539 55609